ప్రజాశక్తి
మంగళవారం 21 జనవరి 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





అసంఘటిత రంగ కార్మికులందరికీ..

ఉచిత ప్రమాద బీమా

- ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా నమోదు చేయించాలి
- కలెక్టర్ వెంకటమురళి ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



కలెక్టర్ వెంకటమురళి

అసంఘటిత రంగ కార్మికులందరికీ అధికారులు ఉచిత ప్రమాద బీమా సభ్యత్వం నమోదు చేయించాలని కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై జిల్లా అధికారులతో కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాల్లో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ పోర్టల్ ద్వారా ప్రమాద బీమా ఉచిత సభ్యత్వ నమోదు చేయించాలని తెలిపారు. 16 నుండి 60 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారంతా పేర్లు నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, వలస కార్మికులు, రిక్షా కార్మికులు, ఇళ్లలో పని చేసేవారు, మత్స్యకారులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు, ఆదాయ పన్ను పరిధిలోకి రానివారంతా అర్హులేనన్నారు. విద్యార్థులు కూడా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. పేర్లను నమోదు చేసుకోదల్చిన వారు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, కార్మిక శాఖ కార్యాలయంలోనూ, లేదా నేరుగా ఇ-శ్రమ్ యాప్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. పేర్ల నమోదుకు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డునకు అనుసంధానమైన మొబైల్ నెంబర్‌ను వెంట తీసుకువెళ్లాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పంపగానే సభ్యత్వం పొందినట్లు యుఏఎన్ నెంబర్ వస్తుందన్నారు. ఈ నెంబర్‌ను అసంఘిటిత రంగ కార్మికులు భద్రపరుచుకోవాలన్నారు. లబ్ధిదారులకు సామాజిక భద్రతతో పాటు ఇతర సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం ఏర్పడినా రూ.రెండు లక్షల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. పాక్షికంగా అంగవైకల్యం ఏర్పడితే ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం వస్తుందన్నారు. ఏదైనా ప్రమాదానికి, విపత్తునకు గురైతే డి.ఆర్.డి.ఏ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసే సమయంలో యు.ఏ.ఎన్ నెంబర్‌ను తెలియజేయాలన్నారు. ఈ పథకం కింద 4,81,711 మందికి బీమా వర్తింపజేయాలని లక్ష్యాలను నిర్దేశించినట్లు వివరించారు. అసంఘటిత కార్మికులందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి డి.గంగాధర్ గౌడ్, రెవెన్యూ డివిజన్ అధికారి పి గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారి

యాజమాన్య హక్కులు అమ్మేశారు..

- కొనేసిన క్యూబ్ హైవే
- టోల్ వసూలు, నిర్వహణ హక్కులను అమ్మేసిన నామ్ ఎక్స్‌ప్రెస్‌వే
- యాజమాన్య మార్పులకు ఆమోదం తెలిపిన ఆర్అండ్‌బీ శాఖ



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అద్దంకి-నార్కెట్‌పల్లి నాలుగు వరుసల రహదారి యాజమాన్య హక్కులను నామ్ సంస్థ క్యూబ్ హైవే అనే సంస్థకు అమ్మేసింది. ఈ మేరకు ఆర్అండ్‌శాఖ సోమవారం నాడు ఆమోదించింది. ఉత్తర్వులు జారీ చేసింది. నార్కెట్‌పల్లి నుంచి అద్దంకి మీదుగా మేదరమెట్ల వరకూ నాలుగు వరుసల రహదారి పనులను నామ్ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెట్ సంస్థ చేపట్టింది. పనులు పూర్తయ్యి చాలా కాలమైంది.

పిపిపి పద్ధతిలో చేపట్టిన ఈ రహదారిని రాంకీ సంస్థ చేపట్టింది. అయితే నామ్ పేరుతో చేపట్టారు. రోడ్డు పనులు పూర్తయ్యాక ఉమ్మడి ప్రకాశంలో సంతమాగులూరు వద్ద టోల్‌గేటు పెట్టారు. నార్కెట్‌పల్లి వెళ్లేలోపు కొన్ని టోల్‌గేట్లు ఉన్నాయి. అప్పటినుంచీ ఈ సంస్థ రోడ్డు నిర్మాణం చేపట్టిన తాలూకు నిధులను టోల్‌గేట్లు ద్వారా వసూలు చేసుకుంటోంది. ఇటీవల ఆస్ట్రేలియాకు చెందిన క్యూబ్ హైవే సంస్థకు పూర్తి షేర్‌ను అమ్మేసింది. ఇక నుంచి ఈ రోడ్డు వసూలు, నిర్వహణ హక్కులు ఇక నుంచీ క్యూబ్ సంస్థకు చెందుతాయి. ఈ బదలాయింపుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు ఆమోదం తెలిపింది.



ఎంపీలకు మెయిల్ సందేశాలు పంపుతున్న నాయకులు

డాక్టర్ స్వామినాథన్ కమిటీ

సిఫార్సులను అమలు చేయాలి

- సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల డిమాండ్
- రైతాంగ సమస్యలపై ఎంపీలకు మెయిల్ సందేశం

6లో

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే

సమ్మె తప్పదు..

- కలెక్టరేట్ వద్ద సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకుంటే సమ్మెకైనా వెనకాడేది లేదని వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు వి.మనోజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో యూనియన్ గౌరవాధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ సహకార ఉద్యోగులను ప్రభుత్వాలు మారినప్పుడల్లా వారి బానిసల్లాగా చూస్తున్నారని, ఈ విధానాలను మార్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుదీర్ఘకాలం నుంచి సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. 2019లో ఇవ్వవలసిన పిఆర్‌సిని ఇంతవరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. సహకార రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కార్పొరేట్ భాగస్వామ్యాన్ని పెంచుతుందని విమర్శించారు. ఇదే జరిగితే ప్రభుత్వ రంగ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని రు.లక్షల కోట్ల రూపాయలను ఎగ్గొట్టిన కార్పొరేట్ సంస్థలు లాగే తమ స్వప్రయోజనాలకి ఉపయోగించుకుంటారని ఆరోపించారు. చిన్న, సన్నకారు రైతాంగ సంక్షేమం నిర్వీర్యం అవుతుందని పేర్కొన్నారు. సహకారంగాన్ని కాపాడుకునేందుకు ఎంతటి పోరాటాల కైనా ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ జీవో నెంబర్ 36 అమలుకు 2019 నుంచి ఆందోళన చేస్తున్నప్పటికీ అమలు చేయకపోవడం విచారకరమన్నారు. ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని అమలుచేయాలని, వయోపరిమితిని 62 సంవత్సరాలుగా పెంచుతూ ▶ 3లో



'కృష్ణవేణి' గీతికలో నృత్య అభినయం

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

మూడో రోజుకు చేరిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు

8లో

ఆటలతో క్రీడా స్ఫూర్తి : డిప్యూటీ కలెక్టర్

కారుమంచి టీంకు మొదటి బహుమతి

ప్రజాశక్తి-కొండపి

క్రీడా స్ఫూర్తి నింపేందుకు ఆటల పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయని డిప్యూటీ కలెక్టర్ ఏ కుమార్ తెలిపారు. కొండపిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌ను కొండపి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత దివంగత దామచర్ల ఆంజనేయులు, కొండపి మండల రెవెన్యూ కార్యాలయం, హైస్కూల్ స్థలదాత దివంగత బూదవాటి సోమయ్య నాయుడు జ్ఞాపకార్థం ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 9వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఏర్పాటు



కారుమంచి టీంకు బహుమతి అందిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఏ కుమార్

చేసినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ కారుమంచి టీంకు, కొండపి హోం టీంకు మధ్య జరగగా అందులో కారుమంచి టీం మొదటి స్థానం కైవసం చేసుకొని రూ.50 వేలు నగదును, షీల్డును అతిథులు చేతుల మీదుగా అందచేయడం జరిగింది. రెండో బహుమతి కొండపి హోం టీంకు రూ.30 వేల నగదు, మూడో బహుమతి దాసిరెడ్డిపాలెం తలయ వాసు టీంకు రూ.15 వేలు అతిథులకు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండపి సిఐ జి సోమశేఖర్, తహశీల్దారు పి మురళి, కొండపి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు, ఎన్‌ఆర్‌కే యూత్ ఫోర్సు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సి.పి.సి. ఆర్డర్ 21 రూల్ 34 నోటీసు
మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. 50/2024
ఇన్
ఓ.ఎస్. 241/2022

Siripalli @ Ciripalli Venkata Subbamma ...D.Hr.
Vs
Shaik Rahimunnisa ...J.Dr.
To
J.Dr. :
Shaik Rahimunnisa,
W/o.Basheer Ahammad, aged about 59 years, Muslim, House wife, resident of 3rd ward, Gorlagadda Street, Markapur Town and Mandal, Prakasam District.

పై నెంబరు ఇ.పి.లోని డిక్రీ మేరకు నీవు 23-02-2000వ తేదీన వాది/డి.హెచ్.ఆర్, పేర వ్రాయించి ఇచ్చిన స్థిరాస్తి విక్రయ స్వాధీన ఖరారు ప్రకారం ఇ.పి. షెడ్యూలు ఆస్థిని, డిక్రీ తేదీ: 17-07-2023 నుండి రెండు నెలల లోపు నీవు డి.హెచ్.ఆర్. పేర రిజిష్టరు విక్రయ దస్తావేజు వ్రాసి ఇవ్వమని కోర్టు వారు ఉత్తర్వులు పాలించియున్నారు. నీవు వ్రాయించి ఇవ్వనందున, డి.హెచ్.ఆర్. నీ మీద పై కోర్టులో పై నెంబరు ఇ.పి.ని దాఖలు చేసియున్నది. ఇందు విషయమై నీకు పలు పర్యాయములు సి.పి.సి. ఆర్డర్ 21 రూల్ 34 ప్రకారం నోటీసులు పంపించి వున్నందున అవి నీకు ముట్టని కారణం చేత, ఈ దిన పత్రిక నోటీసు ద్వారా నీకు తెలియుజేయునది ఏమనగా తేదీ: 07-02-2025న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా నీ తరపు వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసు కొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు ఇ.పి.ని విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా: 07-02-2025 **గెల్లి చౌడేశ్వరరావు**
మార్కాపురం **అడ్వకేట్, మార్కాపురం**
సెల్: 9985009542.

బహిరంగ ప్రకటన

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం హనుమాపురం గ్రామ కాపురస్తుడు కోవి ఆంజనేయులు కుమారుడు కోవి శ్రీకాంత్ నాకు ఇచ్చిన సంజాయిషి మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా లోగా నా క్లయింట్ మరియు తన సోదరుడు అయిన కోవి నాగార్జున తండ్రి ఆంజనేయులు జాయింట్ గా తేది 26-02-2007 సం. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం హనుమాపురం గ్రామ కాపురస్తుడైన బోడపాటి సుబ్బయ్య గారి కుమారుడు కోటయ్య ద్వారా దాన సెటిల్ మెంట్ దస్తావేజు పొంది, అమ్మనబ్రోలు సబ్ రిజిస్టర్ ఆఫీస్ నందు D. No : 220/07 రిజిస్టర్ కాబడిన ఆస్తి నా క్లయింట్ స్వాధీనంలో ఉన్నది దరిమిల తేది : 01-05-2013 కోవి నాగార్జున తండ్రి ఆంజనేయులు మరణించి నాడు తేది: 18-01-2025 సంవత్సరం ఉదయం 10.00 గం సమయంలో నా క్లయింట్ D.No. 220/2007 ఒరిజినల్ కాపీని EC తీసుకోవడం కొరకు హనుమాపురం నుండి AP BA 4520 బండి పై బయలుదేరి అమ్మనబ్రోలు సబ్ రిజిస్టర్ ఆఫీస్ కు చెరిన తరువాత చూడగా ఒరిజినల్ D.No : 220/07 కనబడలేదు అలానే ఎంత ప్రయత్నించినను ఈరోజుకి దొరకలేదు. కావున ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై D.No : 220/2007 ఎవరికైనా ఎటువంటి లావాదేవీలు జరిపిన ఎడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును D.No:220/2007 ఎవరికైనా దొరికిన యెడల ఆదస్తావేజును మా యొక్క చిరునామా గాని మా ఆఫీసు గానీ తెలియపరచ వలసిందిగా కోరుచున్నాను.

ఇట్లు
విస్సా మస్తాన్‌రావు
అడ్వకేట్
జిల్లా కోర్టు ఎదురు
గోల్డెన్ టవర్స్,
ఒంగోలు
సెల్ నెం : 9491315932

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No : 43/2024
in
O.S.No : 400/2021

కొడవటికంటి సుగుణరావు .. డి.హెచ్.ఆర్
వర్సస్
కదం వెంకటరమణ ..జె.డి.ఆర్
టు,
జె.డి.ఆర్ చిరునామా
కదం వెంకటరమణ తండ్రి లేట్ వెంకటేశ్వర్లు, హిందూ, వయస్సు 36సంవత్సరాలు, ప్రైవేట్ ఉద్యోగి,బండి సుబ్బయ్య కాలనీ, సినిమా థియేటర్ దగ్గర, కొమరోలు గ్రామం, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో డి.హెచ్.ఆర్ మీ నుండి పరిహారం రాగోరి పైనెంబరు పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్‌లో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ:21-01-2025న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షమందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
డి.హెచ్.ఆర్ పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం. **9393442442**

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 677/2024
ఇన్
ఓ.ఎస్. 321/2024

పొట్టి వెంకటేశ్వర్లు .... పిటీషనర్/వాది
వర్సెస్
దూదేకుల సిద్ధయ్య (చనిపోయినందున వారసులు)
1) దూదేకుల మీరాంబి మరియు ఇతరులు
.... రెస్పాండెంట్లు/ప్రతివాదులు
ఆర్-2,
దూదేకుల ఈశ్వరమ్మ, భర్త: సిద్ధయ్య
నివాసం: ఇంటి నెం: 4-14, కోనేటివీధి,
మార్కాపురం టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను దూదేకుల సిద్ధయ్య ప్రామిసరీ నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసినారు. సదరు దావాలో ఐ.ఎ. 677/2024 అను జప్తు పిటీషను దాఖలు చేయగా, 2వ రెస్పాండెంట్‌కు నోటీసులు జారీ చేయగా, నోటీసులు ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున తేదీ: 10-02-2025న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు విచారించి కేసు తీర్మానించ బడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 10-02-025 **ఇ.శారద**
మార్కాపురం **అడ్వకేట్, మార్కాపురం.**

In The Court of The Senior Civil Judge Bapatla.
E.A.No: 261/2017
IN
E.P. No: 13/2014 ,
O.S. No:16/2009

Between:
Bolisetty Ramesh Babu. R/o Patel Nagar, Bapatla ..... Petitioner.
And
R.Bolisetty Suseela Babu.S/o Venkata Nageswara Rao,
R/o Returu village, Kakumanu, mandal, Guntur District వగైరాలు..... Respondent.
R6). Chunduru Naga Tripura Lakshmi,W/o Ch .Sudheer,R/o C/o koppuravoori Suresh house, 1st floor, Chejarla Lakshmana Chari Street Ongole, Prakasam district.

పై నెంబరు E.A.No:261/2017లో R6 కు Respondents Notice నిమిత్తం శ్రీ కోర్టు వారు 29-1-2025 వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10:30 గంటలకు శ్రీ కో ర్టు వారి ఎదుట హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేని యెడల మిమ్ములను Exparty చేసి మీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ : 29-1-2025.

ఇట్లు
Nallamothu Subba Rao
B.Sc., B.L , ADVOCATE
D.No.1-19, Rajasekharraopet,
Bapatla-522101,
Cell:9866331763.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు: మార్కాపురం
ఇ.పి. 35/2024
ఇన్
ఓ.ఎస్. 75/2022

ముప్పాళ్ల అప్పారావు .... డి.హెచ్.ఆర్
వర్సెస్
కాకాని ఆంజనేయరెడ్డి ..... జె.డి.ఆర్
టు,
కాకాని ఆంజనేయరెడ్డి
తండ్రి: కోదండ రామిరెడ్డి, వయసు: 68 సం॥,
హిందూ, వ్యవసాయం, 10వ వార్డు,
మార్కాపురం టౌన్ మరియు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పి.లోని డి.హెచ్.ఆర్, జె.డి.ఆర్ అయిన మీ పైన పై ఇ.పి.ని ఇ.పి షెడ్యూల్ భూమిని రిజిష్టర్ చేయమని పై ఇ.పి.ని వేసియున్నారు. పై ఇ.పి. నందు జె.డి.ఆర్. అయిన మీకు ఎన్ని పర్యాయములు ఇ.పి. నోటీసులు పంపిననూ అందుట లేని కారణంగా శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా ఇ.పి. నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున మీరు పై ఇ.పి.లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా తేదీన అనగా 04-02-2025 తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా గానీ లేక మీ వకీలు ద్వారా గానీ మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఖండితముగా తెలియ జేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

పయ్యావుల సత్యనారాయణ
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ, ఒంగోలు, ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నం.2384/2018
ఇన్
ఎ.యస్. /2025

బిట్వీన్
1.మాదాల సుబ్బారావు మరియు వగైరాలు
... పిటిషనర్స్
వర్సెస్
1. పేర్ల మోహన్ రావు మరియు వగైరాలు
... ప్రతివాదులు
To
R17) వాడవల్లి లక్ష్మి, భర్త లేట్ కృష్ణమూర్తి
వినాయక గుడి దగ్గర, గంటా పాలెం, ఒంగోలు
R20) బండారు పద్మావతి, భర్త ఏడుకొండలు,
వడ్డెపాలెం, పద్మావతి గుడి దగ్గర, గంటాపాలెం, ఒంగోలు

పైన ఉదాహరించిన పిటిషనులో గౌరవ కోర్టు వారు నోటీసు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున గౌరవ కోర్టు వారు పత్రికా ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారు. కాబట్టి తేదీ : 30-01-2025న ఉదయం గం.10-30 ని. లకు మీరు స్వయంగా గాని లేక ప్లీడర్ గారి ద్వారా గాని పైన తెలిపిన కోర్టు ముందు హాజరై, మీయొక్క ఆక్షేపణలు తెలుపవలసినది. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

// కోర్టు ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 30-01-2025
ఉదయం గం.10-30 ని.లకు **ఇట్లు**
సి.వి. రామకృష్ణారావు
న్యాయవాది, ఒంగోలు
సెల్ నం.9440000265

మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 227/2024
ఇన్
ఓ.ఎస్. 18/2017

అనమలూరి పెద్ద ఖాశిం ...... పిటీషనర్/వాది
వర్సెస్
బయ్యపురెడ్డి సురేంద్రబాబు వగైరా
.... రెస్పాండెంట్లు/ప్రతివాదులు
టు,
ఆర్-3.
బయ్యపురెడ్డి మధువర్ధన్‌రెడ్డి,
తండ్రి: సురేంద్రబాబు అలియాస్ సుధాకర్‌రెడ్డి,
నివాసం: పులిపాడు గ్రామం, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా.

నోటీసు

పై నెంబరు గల ఐ.ఎ.లో నీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ జారీ కాబడి ఉండలేదు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం తెలియజేయునది ఏమనగా తేదీ: 21-01-2025న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా కానీ, లేదా వకీలు ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకునేది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 21-01-2025
పోతిరెడ్డి బాలరంగారెడ్డి
అడ్వకేట్, మార్కాపురం.
సెల్: 9440250869.

డాక్యుమెంట్లు పోయినవి

ప్రకాశం జిల్లా, ఒంగోలు టౌన్, భాగ్యనగర్, 3వ లైను, డోరు నెం.37-1-408(44)రులో వడ్డెంపూడి వేణుగోపాలరావు గారి కుమార్తె వడ్డెంపూడి లక్ష్మి ప్రియాంక అను నేను నివాశి ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నాతండ్రి గారైన వడ్డెంపూడి వేణు గోపాలరావు గారు తే.11-06-2001 దిన ఒంగోలు టౌన్, రైలుపేట నివాసం కడవకొల్లు వెంకట కృష్ణారావు గారి భార్య వెంకట రాధ గారి వద్ద విక్రయం పొంది ఒంగోలు స.రి. వారి ఆఫీసులో 1వ పుస్తకం, దస్తావేజు నెం.2132/2001 రుగా రిజిష్టరు జరిపించుకొనియున్నారు. నేను తే. 22-07-2024 దిన ఒంగోలు పెద్ద శివాలయం దగ్గర నుండి బైక్ పై ఇంటికి వెళుతున్న క్రమంలో ఒరిజినల్ దస్తావేజు నెం. 2132/2001 రు వున్న కవర్ దారిలో ఎక్కడో జారి పడిపోయినది. కావున ఎవరికైననూ దొరికిన యెడల సెల్ నెం :9866314729 తెలియ జేయగలరు.

ఇట్లు
వడ్డెంపూడి లక్ష్మి ప్రియాంక
భాగ్యనగర్, 3వలైను,
ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా,
సెల్ నెం: 98663 14729

మహారాజశ్రీ ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P No : 58/2019
IN
OS No : 266/2012

Between
నవులూరి అంజయ్య .... పిటిషనరు
మరియు
గట్టినేని చిరంజీవి మరియు ఇతరులు
.. రెస్పాండెంట్లు
To
R4) ఆళ్ల హేమలత,
W/o రామమోహనరావు సీతారామపురం గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా.
R5) కరణం ఝాన్సీ లక్ష్మి
W/o ఉమామహేశ్వరరావు, సీతారామపురంగ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా.

పైనెంబర్ గల E.P.లో మీహజరు నిమిత్తం కోర్టు వారు మీకు నోటీసులు జారీ చేసినప్పటికీ మీరు తీసుకోనందున పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు కావున తేది 30-01-2025కి వాయిదా అయియున్నది. ఆరోజు ఉదయం గం 10.30 నిమిషాలకులకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోనవలెను లేనియెడల మీ పరోక్షములో తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
ఆళ్ల హరిబాబు
పిటిషనర్ల తరపు న్యాయవాది
ఒంగోలు
సెల్ : 9848510650

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 321/2024

పొట్టి వెంకటేశ్వర్లు .... వాది
వర్సెస్
దూదేకుల సిద్ధయ్య (చనిపోయినందున వారసులు)
1) దూదేకుల మీరాంబి మరియు ఇతరులు
.....ప్రతివాదులు
డి-2,
దూదేకుల ఈశ్వరమ్మ, భర్త: సిద్ధయ్య
నివాసం: ఇంటి నెం: 4-14, కోనేటివీధి,
మార్కాపురం టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను దూదేకుల సిద్ధయ్య ప్రామిసరీ నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం కోర్టులో దాఖలు చేసినారు. సదరు దావాలో కోర్టు వారు దావా సమన్లు ఎన్ని సార్లు జారీ చేసిననూ ముట్టని కారణంగా, పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున తేదీ: 10-02-2025న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు విచారించి కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 10-02-025 **ఇ.శారద**
మార్కాపురం **అడ్వకేట్, మార్కాపురం.**



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఆమంచి కృష్ణమోహన్

గుండెపోటుతో జర్నలిస్టు సాంబశివరావు మృతి

ప్రజాశక్తి-వేటపాలెం



సాంబశివరావు(ఫైల్)

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు సాంబశివరావు (50) మృతి చెందారు. ఆదివారం రాత్రి చీరాలలోని తన మీడియా హౌస్‌లో విధులు ముగించుకొని కార్యాలయానికి తాళాలు వేసే సమయంలో గుండెపోటుతో ఒక్కసా రిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కార్యాలయంకి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నారు. సోమవారం కేపాల్ కాలనీలో సాంబశివరావు మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్, పలువురు జర్నలిస్టులు సాంబశివరావు భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ సాంబశివరావు నిబద్ధత కలిగిన జర్నలిస్టు అని కొనియాడారు. ఆయన కుటుం బాన్ని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. సోమవారం మధ్యాహ్నం అంతిమయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో తహశీల్దార్ జె.ప్రభాకర్‌రావు, చీరాల మున్సిపా లిటీ కౌన్సిలర్ మించాల సాంబశివరావు, గజవల్లి శ్రీని వాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

చీరాల: పత్రికా రంగంలో సీనియర్ జర్నలిస్టుగా విశేష సేవలను అందిస్తూ వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న జర్నలిస్టు సాంబశివరావు మృతి బాధాకరమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మృతి పట్ల ఆయన సంతాపం తెలియజేశారు. పొద వీరయ్య, రవికుమార్‌ల ద్వారా రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఈవోపీఆర్‌డీ నరసింహారావు మృతి

ప్రజాశక్తి-అమృతలూరు



నరసింహారావు(ఫైల్)

అమృతలూరు ఈవోపీఆర్‌డీ, రేపల్లె ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో జి.నరసింహారావు సోమవారం గుంటూరులో గుండెపోటుతో మృతి చెందారు. సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న నరసింహారావు మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు. నర్సింహారావు మృతి తీరని లోటన్నారు. నరసింహారావు కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

అతివేగం వల్లే ప్రమాదాలు

ప్రజాశక్తి-బాపట్ల

అతి వేగం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ షేక్ అన్నారు. సోమవారం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర గుంటూరు, జిల్లా రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీస్ శాఖ, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యములో జాతీయ భద్రతా మాసోత్సవాలలో భాగంగా వాలంటీర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు ట్రాఫిక్ నియంత్రణ రహదారి భద్రతా ప్రమాణాలపై ప్రజలకు అవగాహనా కల్పించడానికి ముందుకు వచ్చారు. గుంటూరు నెహ్రూ యువకేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో నజీర్ షేక్ మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నా రు. బాపట్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డివి రంగారావు మాట్లాడుతూ వాహన దారులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల నుంచి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. వాలంటీర్లకు మై భారత్ టీ షర్ట్స్, టోపీలను అందజేశారు. ఈ సందర్భంగా రహదారి భద్రత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్ డీన్, స్టూడెంట్ అఫైర్స్ ఎన్ ఎన్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నిరంజన్ బాబు, రోడ్ సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ నరేంద్ర కుమార్, ఏఎస్ఐ పి.సుబ్బారావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కుష్టు నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రజలు కృషి చేయాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ ప్రణవీ అన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలనపై సోమవారం కూచినపూడి పీహెచ్సీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని రాగి వర్ణపు మచ్చలు, పొడలు, కండరాల్లో బలహీనత, చర్మం చెవి తమ్మెలపై బుడిపెలు, కళ్ళు పూర్తిగా మూసుకో లేకపోవడం లాంటి అనుమానిత లక్షణాలు ఉన్నట్లయితే ప్రాథమికంగా కుష్టి వ్యాధి ఉన్నట్లు నిర్ధారించుకోవచ్చునని తెలిపారు. గ్రామాల్లో ఎవరికైనా కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానాలు ఉంటే వెంటనే సమీప వైద్యశాలకు వెళ్లి వైద్యులను సంప్రదిస్తే వారు వ్యాధిని గుర్తించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తారని తెలిపారు. సూపర్‌వైజర్ మురళి మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానాస్పద లక్షణాలున్న వారిని గుర్తించేందుకు వైద్య సిబ్బందితో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఈ నెల 20 నుండి ఫిబ్రవరి 2 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, మాధవి, పీహెచ్ఎన్ లక్ష్మీ, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్పీలు, అశా వర్కర్లు పాల్గొన్నారు.

26న ట్రాక్టర్, బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జనవరి 26వ తేదీన జరిగే ట్రాక్టర్, బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి కోరారు. సోమవారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిని కాపాడాలాని దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఇచ్చిన రాతపూర్వక హామీని అమలు చేయాలని కోరుతూ జనవరి 26న దేశవ్యాప్తంగా టాక్టర్లతో, బైకులతో ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రైతులు, రైతు కూలీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు టిసిఎస్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి నక్కా తిరుపతయ్య, నూర్జహాన్, ఏఐటియుసి నాయకులు ఆవుల యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని నరజాముల గ్రామంలోని అటవీ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సిహెచ్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు నరజాముల గ్రామ పరిసరాలలోని అడవులలో నాటుసారా తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నాటుసారాకు వినియోగించే 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తయారీదారులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీఐ చెప్పారు. నరజాములతోపాటు సమీపంలోని పలు గ్రామాలలో తమ నిఘా ఉందన్నారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, నాటుసారాకు అవసరమైన ముడిసరుకులు విక్రయించినా చట్టపరమైన చర్యలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలంలోని మర్లపాడు గ్రామంలో పేకాడుతున్న వారిపై టంగుటూరు ఎస్ఐ వి నాగమల్లీశ్వరరావు దాడి చేసి 8 మంది జూదరులను అదుపులోకి తీసుకొని రూ.27,440 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. పేకాట, కోడి పందాలు ఆడటం చట్టరీత్యా నేరమని ఎస్ఐ తెలిపారు.

రైతులకు పట్టలు అందజేత

ప్రజాశక్తి-కొండపి

పొగాకు గ్రేడింగ్ అయిన తరువాత బేలుకు వేసుకునేందుకు పొగాకు వేలం కేంద్రంలో బేలు పట్టలు అందుబాటులో ఉన్నాయని వేలం నిర్వహణాధికారి జి సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం నాడు బేలు పట్టాలను రైతులకు పొగాకు బోర్డు సభ్యులు బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణాధికారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు రైతుల అభీష్టం మేరకు బెల్ పట్టా సైజును పెంచినట్లు తెలిపారు. అలాగే ప్రతి ఒక్క రైతు తమ బోర్డు పాస్ పుస్తకాన్ని తప్పనిసరిగా తెచ్చుకొని పట్టలు తీసుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కలుపు మందు ప్రభావంతో పాడైన..

మొక్కజొన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండలంలోని కలుపు మందు ప్రభావంతో పాడైన మొక్కజొన్న పంట పొలాలను సోమవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. మండలంలోని బైటమంజులూరు, ముప్పవరం, కొండమూరు, రేణింగవరం గ్రామాల్లోని మొక్కజొన్న పొలాలకు అగస్త్య కంపెనీకి చెందిన అట్రాజిన్ కలుపు ముందును చల్లడం వలన 30 ఎకరాల మొక్కజొన్న పొలాలు ఎండిపోయిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయమై రైతులు మరియు వ్యవసాయ అధికారి ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం ఈ పొలాలను పరిశీలించేందుకు గుంటూరులోని లాం ఫామ్ నుంచి ప్రిన్సిపల్ సైంటిస్ట్ (అగ్రనమి) ఎస్.ప్రతిభ శ్రీ, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఎంటమాలజీ) సైంటిస్ట్ డాక్టర్ డయానా గ్రేస్, మార్టూరు సహాయ సంచాలకులు కె.వి. శ్రీనివాసరావు వచ్చి రైతులతో కలిసి రేణింగవరం గ్రామంలో మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, కలుపు మందు పిచికారీ చేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎదుగుదలలేని మొక్కలను, మోము ఎండిపోయిన మొక్కలను పరిశీలన నిమిత్తం వారి వెంట తీసుకువెళ్లారు. ఈ విధంగా జరగటానికి గల కారణాలను పరిశీలించి నివేదికను పంపుతామని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిభ శ్రీ తెలిపారు. కలుపు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, కలుపు మందు పిచికారీ చేసేటప్పుడు తప్పనిసరిగా నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. మందు మోతాదులను నీటి పరిణామాన్ని సూచించిన మేరకే పిచికారీ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంగులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి, వ్యవసాయ సహాయకుడు జె.దినేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సమ్మె తప్పదు..

(మొదటిపేజీ తరువాయి)

జీవోను విడుదల చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఐదేళ్లకోసారి వేతన సవరణ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని, తక్షణం వేతన సవరణ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం చేయడంలో ప్రభుత్వం జాప్యం వహిస్తే రాబోయే రోజుల్లో జరగబోయే సమ్మె పోరాటానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ మాట్లాడుతూ గ్రాడ్యుటి చట్టంపై ఉన్న సీలింగ్ ఎత్తివేసి చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలన్నారు.. 2019 తర్వాత ఉద్యోగాలలో చేరినటువంటి వారందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సహకార సంఘాల బోర్డులో చిన్న, సన్నకారు రైతుల స్థానంలో కార్పొరేట్ సంస్థలకి ప్రవేశం కల్పించడం అంటే ఉద్యోగులకి రైతులకు ప్రమాదమని, దీనిని ఉద్యోగులు, రైతాంగం అడ్డుకోవాలని కోరారు. అధ్యక్షత వహించిన మనోజ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కాకపోతే ఎంతటి పోరాటాలకైనా సిద్ధపడతామని హెచ్చరించారు. ధర్నాకు పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.శేషయ్య తన సంపూర్ణ సంఘీభావం తెలియజేసి.. మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కార్తీక్‌రెడ్డి, కన్వీనర్ రామిరెడ్డి, కష్ణ చైతన్య, వీరబ్రహ్మం, రమణారెడ్డి, రమేష్, శ్రీనివాసరావు, రంగయ్య, ప్రసాద్ రావు, శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్, సందీప్, సతీష్ బాలాజీ తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం కలెక్టరేట్ నుం డి నెల్లూరు బస్టాండ్, అటు నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు.



డీఎస్పీ రత్తయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని మున్నంగివారిపాలెం, తనుబొద్దివారి పాలెం, చీమటావారిపాలెం, యద్దనపూడి, సూరవరపుపల్లి గ్రామాలలో సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పర్యటించారు. పలువురిని పరామర్శించారు. మున్నంగివారి పాలెంలో మాజీ సర్పంచ్ చెరుకూరి పెద్ద నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తనుబొద్ది వారిపాలెంలో కారుమూడి సాంబిరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. చీమటావారిపాలెంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. యద్దనపూడి మాజీ ఎంపీపీ గొట్టిపాటి రాంబాబును పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన డీఎస్పీ మద్దూలూరి రత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రావిపాటి సీతయ్య, కనపర్తి నాగేశ్వరావు, రంగయ్య చౌదరి, కోయ సతీష్, బోయపాటి సాంబయ్య, అనిల్, తారక, గండు శంకరరావు పాల్గొన్నారు.

అశోక్‌బాబుకు అభినందనలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు



అశోక్‌బాబును అభినందిస్తున్న సురేష్, ప్రతాప్

వైసీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికుటి అశోక్‌బాబు రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎన్నికైన నేపథ్యంలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామానికి చెందిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ నేషనల్ వైస్ చైర్మన్ యన్నం సురేష్, నాయకులు ప్రతాప్ అశోక్ బాబును కలిసి పూలమాలలు బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం యన్నం సురేష్, బొల్లెద్దు ప్రతాప్ మీడియాతో మాట్లాడుతూ తమ నాయకుడిని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు. అశోక్ బాబు కార్యకర్తలకు ఎల్లప్పుడూ తోడు నీడగా ఉంటున్నారని తెలిపారు. వైసీపీకి పూర్వ వైభవం రావాలంటే అశోక్ బాబు లాంటి నాయకులు కావాలన్నారు. యన్నం సురేష్‌తో పాటు గుజ్జర్లమూడి రాజు, పల్లికోన సర్పంచ్ బొల్లెద్దు ప్రతాప్, రాచూరు గ్రామ సర్పంచ్ రాధాకృష్ణ, రెబ్బా యారన్, కట్టుపల్లి కిషోర్, కనపర్తి నాగరాజు శొంఠి సాయి, కనపర్తి దేవేంద్ర, పంతగాని ప్రవీణ్, పంతగాని బాలు, కనపర్తి విరబాబు, యన్నం కార్తీక్ తదితరులు ఉన్నారు.



ఫ్లెమింగో వేడుకలను తిలకిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ఫ్లెమింగో ఫెస్టివల్ వేడుకల్లో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-చీరాల

నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట దగ్గరలోని నేలపట్టులో జరుగుతున్న ఫ్లెమింగో ఫెస్టివల్ వేడుకల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శనతో పాటు వ్యవసాయ, అటవీ, ఉద్యాన, సాంకేతిక, పశు సంవర్ధక శాఖలు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌ను సందర్శించారు. ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఈ ఉత్సవాలలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

రాజ్యాంగ రూపకర్త, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తక్షణమే భర్తరఫ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. రాజ్యసభ సమావేశాల్లో కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్ పట్ల చులకనగా మాట్లాడటాన్ని ఖండిస్తూ మండలంలోని బి.మాచవరంలోని కమ్యూనిటీ హాల్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ అమిత్‌షా అనుకోకుండానో, పొరపాటుగానో అంబేద్కర్ని అవమానంగా మాట్లాడలేదని, కావాలనే అలా మాట్లాడాడని మండిపడ్డారు. అంబేద్కర్ ఆధ్వర్యంలో రచించిన రాజ్యాంగాన్ని తొలగించి దాని స్థానంలో సనాతన వాదమైన మనుధర్మ శాస్త్రాన్ని నెత్తికెత్తుకోవాలని పాలకులు భావిస్తున్నారని, అందులో భాగంగానే అమిత్‌షా ఇటువంటి వ్యాఖ్యలు చేశారని ఆయన అన్నారు. దేశంలో సామాజిక సమానత్వానికై అహర్నిశలు శ్రమించిన యోధుడు అంబేద్కర్ అన్నారు. అంటరానితనం, అమానుషాలు అంతం కావాలని, కుల నిర్మూలన జరగాలని, సమానత్వ సమాజం రావాలని తన జీవితాంతం అంబేద్కర్ పోరాడారని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్, బిజెపి నేతలు అంబేద్కర్ పట్ల ఆయన ఆశయాలు, ఆలోచనల పట్ల నిత్యం వ్యతిరేకతతోనే ఉన్నారని అన్నారు. జాతి గర్వించదగ్గ అంబేద్కర్ పట్ల అమానుషంగా మాట్లాడిన అమిత్‌షా తక్షణం రాజీనామా చేయాలని, లేదా కేంద్ర ప్రభుత్వం అయినా ఆయన బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలు కేంద్ర పాలకులకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సుబ్బారావు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు 420 ఎంపీ స్థానాలు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బిజెపి ప్రకటించిందని అన్నారు. ప్రజలు బిజెపి పిలుపుని తిరస్కరించారని, 60 స్థానాలకు పైగా ఓడగొట్టి బిజెపికి బుద్ధి చెప్పారని అన్నారు. దేశంలో లౌకికతత్వం, సమానత్వం, సోదరభావం విలసిల్లాలని ప్రజలు కోరుకున్నారని ఎన్నికల తీర్పు వెల్లడించిందని అన్నారు. సంపూర్ణ మెజారిటీ లేకపోయినా ఎన్డీఏ పక్షాల మద్దతుతో అధికారాన్ని వెలగబెడుతున్న మోడీ ప్రభుత్వం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులన్నిటిని సర్వనాశనం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయటం, సామాజికపరంగా ఉన్న రిజర్వేషన్లను రద్దు చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు. ప్రకృతి వనరులు, ప్రజా సంపద అంతా కార్పొరేట్లకు కట్టబెట్టి వారిచ్చే డబ్బుతో అధికారాన్ని హస్తగతం చేసుకుంటూ దేశంలో సంపద సృష్టి కర్తలైన కార్మిక, కర్షక, కష్టజీవులకు వ్యతిరేకమైన విధానాలను అనుసరిస్తున్నారని అన్నారు. అటువంటి ఆలోచన విధానంతో ఉన్నారు కనకే అంబేద్కర్‌ను తూలనాడే విధంగా మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత అమిత్ షా వ్యాఖ్యల పట్ల స్పందించకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు అన్నవరపు శేషారావు, అంబేద్కర్ యూత్ నాయకులు పూరిమిట్ల వినయ్, బొమ్మతోటి బాలు, దమ్ము బన్నీ, అన్నవరపు రోహిత్, ఎ.రాము, నరేష్, శివాజీ, అభిలాష్, పూరిమిట్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతిని పట్టాలెక్కిస్తున్నాం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

సజ్జాపురంలో సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఐదేళ్ల వైసిపి విధ్వంసకర పాలనలో పల్లెల్లో ఆగిపోయిన ప్రగతిని మళ్లీ పట్టాలెక్కించి ప్రజలందరికీ మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని సజ్జాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.20 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రోడ్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ప్రజా వేదిక ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సంపూర్ణ గ్రామీణ వికాసం సాధించే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దుడ్డు రవి, ఎంపీపీ వై.ఎలమంద, ఎంపీడీవో జ్యోతిర్మయి, తహశీల్దార్ కె.రవిబాబు, పంచాయతీరాజ్ ఏఇ నాగేశ్వరరావు, ఏపీవో బాలకృష్ణ నాయక్, నాయకులు తేలప్రోలు రమేష్, కంచేటి మురళి, తేలప్రోలు వెంకట్రావు, అనంతవరపు దేవా, అనంతవరపు శ్యాంబాబు, చేవూరి వాసు రెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు గాడిపర్తి వెంకటరావు, బీసీ సంఘం నాయకులు మాదాల సుబ్బారావు, వేముల లక్ష్మయ్య, ధూపాటి ఏసోబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్, డి గాలెయ్య, అయినాల గోపి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

భట్టిప్రోలు: మండలంలోని చింతమోటు కొత్త కాలనీలో రూ.20 లక్షల ఉపాధి నిధులతో సీసీ రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. కూటమి ప్రభుత్వ పాలనలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో మండలానికి ఆయా గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. పలు గ్రామాల్లో సిసి రహదారుల నిర్మాణం కొనసాగుతోంది. సీసీ రహదారి నిర్మాణం చేపట్టడం పట్ల ప్రజలు హర్ష వ్యక్తం చేస్తున్నట్లు నాయకులు యలవర్తి జార్జి తెలిపారు.



చింతమోటులో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం

గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపీనాథ్

ప్రజాశక్తి-సంతమాగులూరు

గ్రామాలలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, ప్రతి వీధిలో సైడ్ కాల్వలు శుభ్రం చేయించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపీనాథ్ పీహెచ్‌సి సిబ్బందికి సూచించారు. సోమవారం సంతమాగులూరు ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్, ఆశాలు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం సంతమాగులూరు గ్రామంలోని బీసీ హాస్టల్, మరియు గ్రామంలోని ప్రధాన వీధుల వెంట పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ గ్రామంలో వీధులు వెంట ఉన్న సైడ్ కాలువలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. లేకుంటే దోమలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ దోమ కాటు వలన మలేరియా, డయేరియా, మెదడువాపు, చికెన్ గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంట డాక్టర్ నిర్మల్ కుమార్, డాక్టర్ సాహిత్య, భూపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.




కాలువలో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-వేటపాలెం

పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని దేశాయిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థులకు సభ్యత్వం నిమిత్తం రూ.వెయ్యి అందజేశారు. దేశాయిపేట హైస్కూలు హెచ్ఎం మాల్యాద్రి ఈ సందర్భంగా మాట్లాడు తూ ప్రతిఒక్కరు గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో అందరికీ ఉపయోగపడే ఎన్నో రకాల పుస్తకాలు ఉన్నాయని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ తెలియజేశారు.



సభ్యత్వాలు పొందిన విద్యార్థులు

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 డిమాండ్

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యుత్ శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎపి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 డిమాండ్ చేసింది. ఆ యూనియన్‌కు సంబంధించిన 2025 క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి నాగేశ్వరరావు క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు పలువురు సమస్యలు ఇఇ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 లకు వార్షిక ఇంక్రిమెంట్‌తో పాటు ఎస్ క్యాప్మెంట్ ఇవ్వాలన్నారు. దాంతో పాటు రెగ్యులైజేషన్ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణలో భాగంగా సిబ్బందికి భద్రతా పరికరాలు అందించాలన్నారు. విద్యుత్ శాఖ ఇఇ పి.వి.నాగేశ్వరరావు స్పందించారు. తన పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉన్నత స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యల సాధన కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని చెప్పారు. విద్యుత్ సంస్థ లాభాల్లో ప్రయాణించేలా, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఇఇ నాగేశ్వరరావు

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 నాయకులు టి జాన్సన్, ఆర్ మోహన్‌రావు నాయక్, మునుస్వామి, ఎల్ కొండయ్య, జి మంత్రు నాయక్, ఎ.బాల నాగయ్య, పి కాశయ్య, పి దస్తగిరి, రాం ప్రసాద్, షేక్ అన్వర్ భాష, ఎస్.ఖాదర్‌బాషా, పి రమణమూర్తి, జాషువా, ఆర్ వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎపి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 మార్కాపురం డివిజన్ నూతన కమిటీ ఎన్నిక ఇటీవల జరిగింది. డివిజన్ అధ్యక్షులుగా కె.మల్లికార్జునరావు, కార్యదర్శిగా సిహెచ్ రవికాంత్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శింగారెడ్డి సుబ్బారెడ్డి, డివిజన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా షేక్ ఇస్మాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎగ్జికూటివ్ ఇంజనీర్ పివి నాగేశ్వరరావుకు నూతన కమిటీని పరిచయం చేసుకున్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ సారించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించారు. మా సమస్యలు పరిష్కరించండంటూ బాధితులు అర్జీల ద్వారా జిల్లా కలెక్టర్‌కి విన్నవించారు. వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్ కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. పిజీఆర్ఎస్ లో 145 అర్జీలు నమోదు అయ్యాయి. జిల్లా పశు సంవర్ధక శాఖ ద్వారా చేపడుతున్న "ఉచిత పశు ఆరోగ్య శిబిరాల" గోడ పత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. ఈనెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన 2025 సంవత్సరం డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ విడుదల చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు ఉచితంగా భోజనం సదుపాయం కల్పించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అధికారులు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పంచాయతీ శాఖలో 28 అర్జీలు పెండింగ్ లో ఉంటే ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. మున్సిపాలిటీ, వివిధ శాఖల్లోనూ పెండింగ్ లో ఉండడంపై ఆయన ఆరా



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ వెంకటమురళి

తీశారు. పెండింగ్ అర్జీలపై పూర్తిస్థాయిలో ఆడిట్ చేయాలని, గడువులోగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కుల గణన సర్వేలో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారంపై వీక్షణ సమావేశం ద్వారా మండల అధికారులతో సమీక్షించారు. బాపట్ల మండలంలో 22 అర్జీలు, బల్లికురవలో ఐదు, చీరాల పట్టణంలో మూడు, గ్రామీణ ప్రాంతంలో నాలుగు అర్జీలు పెండింగ్ లో ఉండడంపై ఆరా తీశారు. ప్రజా ప్రతినిధుల ద్వారా వచ్చిన 156 అర్జీలను సత్వరమే పరిష్కరిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులకు అధిక ప్రాధాన్యతనివ్వాలని, సంబంధిత అధికారులకు యాప్ లో నిక్షిప్తం చేయాలన్నారు. అర్జీల పరిష్కారం తదుపరి సంబంధిత ప్రజా ప్రతినిధులకు సమాచారం పంపాలని ఆదేశించారు. ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ లో అర్జీలు ఇవ్వడానికి సుమారు 200 మంది వస్తున్నారన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆర్ డబ్ల్యు ఎస్ అధికారిని ఆదేశించారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు రెడ్ క్రాస్ సంస్థ భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ.. మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. ఈ ఉత్పత్తుల అమ్మకాల కోసం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో నాలుగు స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంస పత్రాలకు ఉద్యోగుల పేర్లు పంపాలన్నారు. ఇటీవల వరద విపత్తు సమయంలో కష్టపడి పని చేసిన సిబ్బందికి, కార్యాలయాలలో ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్న సిబ్బందిని గుర్తించి పేర్లను పంపాలని ఆదేశించారు. ఎం ఎస్ ఎం ఈ విద్యుత్ సర్వీసుల సర్వేలో మిగిలిపోయిన వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎన్ పి సి ఐ లింకేజీ, వలస కూలీలు సర్వేలపై సమగ్రంగా సమీక్షిస్తామన్నారు. విశేష సేవలు అందిస్తున్న రెడ్ క్రాస్ సంస్థలో సభ్యత్వ నమోదు బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి మండలంలో 50 మందికి తగ్గకుండా ఎండిఓలు సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. సభ్యత్వం పొందే ప్రతి ఒక్కరూ రూ.1, 100లు చెల్లించేలా ఎండిఓలు చర్యలు తీసుకోవాలన్నారు. రెడ్ క్రాస్ లో చేరిన వారికి జీవితకాల సభ్యత్వ కార్డును అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి డి.గంగాధర్ గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారి పి గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ అక్షరజ్ఞానం పొందాలి

ఎంపీడీవో శ్రీనివాసులు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి మహిళ అక్షర జ్ఞానం కలిగి ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. స్థానిక ఎస్సీబీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళల కోసం నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంలో స్వచ్ఛందంగా మహిళలకు చదువు నేర్పించేందుకు ముందుకు వచ్చిన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం వెలుగు ఏపీఎం పిచ్చయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ కుటుంబంలో మహిళ చదువుకున్న వ్యక్తి అయితే ఆ కుటుంబం అన్ని విధాల మంచి అభివృద్ధిని సాధిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ తమీ మ్ అన్సారియా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని స్వచ్ఛందంగా మహిళలకు బోధించబోతున్న వాలంటీర్ ఉపాధ్యాయులను కోరారు. మహిళలు చదువు నేర్చుకోవడం వలన



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

సమాజంలో అనేక ఉపయోగాలు ఉన్నాయని వారికి వివరించాలని తెలియజేశారు. మహిళలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రభుత్వం పుస్తకాలను రూపొందించిందని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ కార్యక్రమం బోధన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, ఎంఈఓ రాందాస్ నాయక్, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్వైజర్ యూన్సీ, సీసీలు నాగయ్య, మనోకుమారి, వివో ఏలు, వాలంటీర్ టీచర్లు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఏఎస్పీ విఠలేశ్వర్

బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలి

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల యొక్క వ్రాతపూర్వక అర్జీలను అడిషనల్ ఎస్పీ స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 58 మంది ఫిర్యాదిదారులు వారి సమస్యలను అడిషనల్ ఎస్పీ కి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డిఎస్పీ జగదీష్ నాయక్, పి.జి.ఆర్.ఎస్ సెల్ ఎస్.ఐ శ్రీనివాస్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలు పరిరక్షించడంలో

ఏఆర్ పోలీస్ సిబ్బంది విధులు కీలకం

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

శాంతి భద్రతలు పరిరక్షించడంలో ఆర్మడ్ రిజర్వ్ (ఏఆర్) పోలీస్ సిబ్బంది విధులు కీలకమని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి రెండు వారాల "మొబలైజేషన్" కార్యక్రమాన్ని సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో అడిషనల్ ఎస్పీ ప్రారంభించారు. సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై పోలీస్ విధులు సమర్థవంతంగా నిర్వహించడానికి తగిన మెళకువలు సూచించడంతో పాటు వ్యక్తిగత జీవితంలో కుటుంబ సభ్యులకు ఇవ్వవలసిన ప్రాధాన్యత, తగిన సమయం కేటాయింపు, ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ విధులు నిర్వహించే విధానం తదితర విషయాల గురించి రిజర్వ్ పోలీస్ సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ విధులు చాలా కీలకమన్నారు. పోలీస్ ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించేందుకు కఠినమైన శిక్షణ, తగిన మెళకువలను శిక్షణ సమయంలో నేర్పడం జరుగుతుందన్నారు. ఇతర ఉద్యోగాల కంటే పోలీసు ఉద్యోగం భిన్నంగా ఉంటుందన్నారు. పోలీసులు చేసే ప్రతి పనిలోనూ ఎంతో నేర్పరితనం, సమయస్ఫూర్తి, నైపుణ్యంతో కూడుకుని ఉంటాయన్నారు. సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణతో మెలగడం కీలకమన్నారు. వర్తిస్తోత్యా పోలీస్ శాఖలో చోటుచేసుకుంటున్న నూతన



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

మార్పులను అందిపుచ్చుకునే విధంగా ఏ.ఆర్ సిబ్బందికి ప్రతీ సంవత్సరం మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ, నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు. బి.డి టీం, పి.ఎస్.ఒ లు, ఎస్కార్ట్, డ్రైవర్స్ తదితర విధుల గురించి, ఫైరింగ్ , డ్రిల్, కవాతు, మాబ్ కంట్రోల్ చేసే విధానం, వివిపి ఎ బందోబస్తు, తదితర విధులు మరింత సమర్థవంతంగా నిర్వహించేలా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. రెండు వారాల పాటు జరిగే "మొబలైజేషన్" కార్యక్రమాన్ని ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది సద్వినియోగం చేసుకొని వత్తి నైపుణ్యం పెంపొందించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అడిషనల్ ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ తో పాటు అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్.ఐ శ్రీనివాస రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ బాలరాజుకు ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అభిలాష హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారు నిర్వహిస్తున్న ఐదవ వార్షికోత్సవ వేడుకలు, జ్యోతిరావు పూలేసావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని, సోమవారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో పెద్ద దోర్నాల మండలంలోని ఐమ్మిదోర్నాలకు చెందిన డాక్టర్ బాలరాజుకి సావిత్రిబాయి, జ్యోతిరావుపూలే జాతీయ ఐకాన్ అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. బాలరాజు మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. సమాజ సేవ కార్యక్రమాలు చేపట్టారు. తన నైపుణ్యతను గుర్తించి ఈ అవార్డును అందజేసినట్లు అవార్డు బాలరాజు తెలిపారు. తన సేవలను గుర్తించి తనకు అవార్డును అందజేసిన ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ బాలరాజు

ఆరోతరగతి ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నందు ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానచార్యులు ఈశ్వర్ సింగ్ సోమవారం తెలిపారు. 2024, 2025 సంవత్సరంలో 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండి ఇంగ్లీషు లేదా తెలుగు మీడియం నందు చదివిన గిరిజన బాల బాలికలు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 19వ తేదీలోగా ఆన్లైన్లో పంపుకోవాలని చెప్పారు. రాత పరీక్ష ఫిబ్రవరి 25వ తేదీన ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 9416094165 కి సంప్రదించాలని చెప్పారు.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి రమణ

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, క్విజ్ పోటీలతోపాటు సోమవారం చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 25న జరుపుకునే జాతీయ ఓటర్ల దినోత్సవం, భారత ఎన్నికల సంఘం స్థాపనను సూచిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 2011లో స్థాపించబడి నేటి పౌరులను, యువతను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనమని ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య పాలనకు మూలస్తంభమైన భారత పౌరుల ఓటు హక్కును సూచిస్తుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె ప్రభుదాస్, పొలిటికల్ సైన్స్ లెక్చరర్ బివి రమణ, చరిత్రలో అతిథి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సిఎం దావోస్ పర్యటన'

ప్రజాశక్తి-దర్శి



డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

యువతకు ఉద్యోగాలు, భారీ పెట్టుబడుల లక్ష్యంగా దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో సిఎం చంద్రబాబునాయుడు, ఐటిశాఖ మాత్యులు లోకేష్ బాబు దావోస్ పర్యటన విజయవంతంగా సాగడం అందరి అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధికి ఒక శుభ సూచకమని తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా జరుగుతున్న దావోస్ పర్యటనపై ఆమె సోమవారం మాట్లాడారు. ఏపీలో ఫార్మా రంగంలో స్విస్ పెట్టుబడులను అందించాలని, స్విస్ అంబాసిడర్ మృదుల్ కుమార్‌తో సీఎం చంద్రబాబు, లోకేష్ బృందం భేటీ విజయవంతంగా ముగియడం ఎంతో గర్వకారణమని అన్నారు. మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఆర్అండ్‌డి కేంద్రాలు ఏర్పాటుకు సహకరించాలని కోరారని తెలిపారు. ఏపీలో వరల్డ్ క్లాసు పిజిఎ గోల్ఫ్ సిటీ ఏర్పాటుకు స్టాఫ్ క్రాఫ్ట్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ సమావేశమై అందుకు సంబంధించి 15రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి రూపు దిద్దుకునేందుకు అవసరమైన అన్నీ అవకాశాలు వినియోగించుకునేందుకు అధినేతల పర్యటన సాగుతుందని ఆమె తెలిపారు.



అన్నదానం చేస్తున్న నల్లా అప్పారావు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

పట్టణంలోని పొదిలి రోడ్డు వాస్తవ్యులు నల్లా రమాదేవి వర్ధంతి సందర్భంగా స్థానిక కురిచేడు రోడ్డులోని శ్రీ షిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. ఇలా అన్నదానం చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా నల్లా అప్పారావు, కూతుళ్లు, అల్లుళ్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తీర్మానం లేకుండా పనులెలా మంజూరు చేశారు.?

మండల సమావేశంలో అధికారులపై ఎంపిటిసిల ఆగ్రహం



సమస్యలపై ఎంపీడీఓను నిలదీస్తున్న ఎంపిటిసి రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల పరిషత్ తీర్మానం లేకుండానే అభివృద్ధి పనులు ఎలా మంజూరు చేశారని వైస్ ఎంపిపి మెట్టు వెంకటరెడ్డి, గొట్లగట్టు ఎంపిటిసి ఉడుముల రామనారాయణరెడ్డి, పలువురు సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపిపి మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఎంపిటిసిలకు తెలియకుండానే పంచాయతీల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ముందుగా సమాచారం ఇవ్వటం లేదని తెలిపారు. ఎన్ఎపి నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, కనీసం సమాధానం చెప్పేందుకు కూడా ఎన్ఎపి ఏఇ సమావేశాలకు హాజరు కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వారిపై ఏ చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పాలని ఎంపిడిఓ ఈశ్వరమ్మను వైస్ఎంపిపి మెట్టు వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశానని ఆమె సమాధానం ఇచ్చారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల మంజురకు నిర్వహించే గ్రామ సభలకు తమకు సమాచారం ఇవ్వటం లేదని పలువురు ఎంపిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వద్దిమడుగు యుపి స్కూల్‌లో నాడు-నేడు పనులు అసంపూర్తిగా మిగిలాయని, విద్యార్థులు ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ చక్కర వెలుగొండయ్య, సర్పంచి పిన్నిక పిచ్చయ్య ఎంఇఓ ఎస్‌కె డాంగేషరీఫ్‌పై మండిపడ్డారు. నాగంపల్లి యుపి స్కూల్లో అసంపూర్తిగా పనులు మిగిలాయని ఎంపిటిసి కోండ్రు వెంకటేశ్వర్లు ఆరోపించారు. నాగంపల్లి యుపి పాఠశాల్లో పనులు అసంపూర్తిగా మిగిలాయని, ఎస్ఎంసి అకౌంట్‌లో నిధులు ఉన్నప్పటికీ ఎందుకు ఖర్చు చేయలేదని ప్రశ్నించారు. పాఠశాలల పర్యవేక్షణ నామ మాత్రమేనని చినమనగుండం ఎంపిటిసి కొండ్రు వెంకటేశ్వర్లు, జడ్‌పిటిసి ఏడుకొండలు ఎంఇఓ డాంగే షరీఫ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వద్దిమడుగు పాఠశాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉందని, దీంతో ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉన్నదని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదని వద్దిమడుగు సర్పంచ్ పిన్నిక పిచ్చయ్య ఆందోళన వ్యక్తం చేశారు. డిఎల్‌డిఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో జరిగే పనులు, సమావేశాల్లో ఎంపిటిసిలు, సర్పంచులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్య పునరావృతం కాకూడదన్నారు. తొలుత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపిటిసి పిల్లి లక్ష్మీనరసయ్య మృతికి కొద్దిసేపు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో పిఆర్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ ఎఇలు శ్రీనివాసరెడ్డి, బ్రహ్మం, జ్యోతిసృజ, బాలునాయక్, ఏపిఎం బి సుధాకరరావు, ఎపిఓ బుల్లెన్‌రావు, వైద్యాధికారులు పృథ్వీరాజ్, సురేఖ, ఎఒ ప్రసన్న రంగలక్ష్మి, యుఆర్‌డి శ్రీదేవి, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాజీ ఎంపిటిసి లక్ష్మీనరసయ్య మృతికి మౌనం పాటిస్తున్న సభ్యులు

భార్యను వేధిస్తున్నాడంటూ ఇంటిపై దాడి

ప్రజాశక్తి - దొనకొండ

తన భార్య వెంటపడుతూ విపరీతంగా వేధిస్తున్నాడని అతని ఇంటి వద్దకు వెళ్లి ఘర్షణ పడి అతని ఇంటి ప్రక్కనున్న రేకుషెడ్డును ధ్వంసం చేసి నిప్పంటిచగా రెండు మోటార్‌సైకిళ్లు, ఒక ఆటో దగ్ధమైన సంఘటన మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామంలోని ఎస్టీ కులంకు చెందిన మాట వెంకటేశ్వర్లు అతని ఇంటి ప్రక్కన ఉంటున్న దుగ్గెంపూడి మల్లిఖార్జున భార్య వెంట పడుతూ వేధిస్తున్నాడని, ఈ విషయమై వెంకటేశ్వర్లును మందలించేందుకు మల్లిఖార్జున మరికొందరు అతని ఇంటి వద్దకు వెళ్లారని తెలిపారు. ఇంట్లో వెంకటేశ్వర్లు లేకపోవటంతో అతని భార్య శివమ్మతో గొడవపడి కులంపేరుతో ధూషించి అంతటితో ఆగకుండా అతని ఇంటి ప్రక్కనే ఉన్న రేకులషెడ్డును ధ్వంసం చేసి నిప్పుపెట్టారని తెలిపారు. ఈ ప్రమాదంలో రెండు మోటారుసైకిళ్లు, ఒక ఆటో దగ్ధమయ్యాయి. వెంకటేశ్వర్లు భార్య శివమ్మ పిర్యాదు మేరకు మల్లిఖార్జున, అతని అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మల్లిఖార్జున భార్య పిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇరువురి కేసులను నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న త్రిపురాంతకం సిఐ హస్సాన్ రుద్రసముద్రం గ్రామంకు చేరుకొని సంఘటనా ప్రదేశంను పరిశీలించి ఎటువంటి ఉద్రిక్త పరిస్థితులు జరగకుండా గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.



రుద్రసముద్రం గ్రామంలో దగ్ధమైన రేకులషెడ్డు

పింఛన్ దరఖాస్తుల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - కురిచేడు

కొత్తగా పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఎప్పుడు వస్తుందోనని లబ్దిదారులు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి పింఛనకు అర్హత కలిగిన వారికి వాలంటీర్ల ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. తదుపరి విచారించి లబ్దిదారులకు అర్హత కలిగి ఉంటే కొత్త పింఛన్లు అందచేసేవారు. ప్రభుత్వం మారి ఏడు నెలల కావస్తున్నా పింఛను కోసం సచివాలయాల్లో నమోదు చేసుకోవడానికి అవకాశం ఇవ్వలేదు. దీంతో లంబ్దిదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఏ దిక్కులేని అనాధలు ప్రభుత్వం ఎప్పుడు నూతన పింఛను నమోదు ప్రక్రియ ప్రారంభిస్తుందాని ఎదురు చూడటం వంతయింది. ఎన్నికల్లో హామీలు ఇచ్చిన నాయకులు కనుమరుగు అయ్యారని లబ్దిదారులు ఆరోపిస్తున్నారు. ఇళ్లలో చూసేవారు లేక వయసుపై బడి రోగాల బారిన పడి మందులు కొనడానికి డబ్బులు లేక అనేక ఇబ్బందులకు పడుతున్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం పింఛను నమోదు ప్రారంభించాలని అర్హత కలిగిన లబ్దిదారులు ఎదరు చూస్తున్నారు.

ప్రక్రియ మొదలుకాగానే నమోదు చేస్తాం



ఎంపిడిఒ బి సతీష్‌బాబు

కొత్తగా పింఛను దరఖాస్తులకు నమోదు ప్రక్రియ ఆపి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియ మొదలు పెట్టగానే మండలంలోని అన్ని పంచాయితీలకు దరఖాస్తులు చేసుకోవడానికి తెలియచేస్తామని ఎంపిడిఒ బి సతీష్‌బాబు తెలిపారు.

కొత్త పింఛను కోసం ఎదురు చూస్తున్నా



ఆటో డ్రైవర్ మీరావలి

పింఛను నమోదు కోసం ఎదురు చూస్తున్నామని ఆటో డ్రైవర్ మీరావలి తెలిపారు. పింఛను డబ్బులు వస్తే వృద్యాప్యంలో మందులకు ఉపయోగపడతాయని అన్నారు. వెంటనే ప్రభుత్వం పింఛను నమోదు ప్రక్రియను మొదలు పెట్టి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.



ఎంవిఐ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు

డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు

ప్రజాశక్తి-దర్శి

జాతీయ రహదారి భద్రత 36వ మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 16నుండి ఫిబ్రవరి 15వరకు వివిధ అవగాహన, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా లారీ, ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్సుల డ్రైవర్లులకు కంటి పరీక్షలు ఎంవిఐ యూనిట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంను మోటారు వాహనాల తనిఖీ అధికారి పి రవికుమార్ ప్రారంభించారు. దర్శి లయన్స్ క్లబ్ సహకారంతో దాదాపుగా 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ గీత పద్మ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ జి శ్రీనివాసరావు, వైస్‌సెక్రటరి ఎన్ మధు, వైస్‌ప్రెసిడెంట్ స్వాముల, రవాణాశాఖ సిబ్బంది, హెూమ్ గార్డ్స్ పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి గొటిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

రైతులు ప్రభుత్వం నిర్వహించనున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అద్దంకి పశు వైద్యాధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం తగిన నిధులు కేటాయించిందని రైతులు ఆర్థిక అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పశువులు ఆరోగ్యానికి వివిధ కార్యక్రమాల నిర్వహిస్తుందన్నారు. ఉచిత ఆరోగ్య శిబిరాలు, నట్టల నివారణ కార్యక్రమాలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, అవగాహన సదస్సులు ఈ శిబిరాలలో



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



మార్టూరులో మందులు అందజేస్తున్న దృశ్యం

నిర్వహించబడతాయని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే గోకులం, బహు వార్షిక పశుగ్రాస క్షేత్రాలు, సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

నిజాంపట్నం: ప్రభుత్వ ఆదేశాల మేరకు కూచినపూడి పశువైద్యశాల పరిధిలోని అన్ని గ్రామాలలో నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కూచినపూడి పశువైద్యాధికారి డాక్టర్ ఎం.హేమప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న బొర్రావారిపాలెం, 22న కూచినపూడి, 23న ప్రజ్ఞం, 24న గరువుపాలెం, 25న కళ్లిఫలం, 27న అడవులదీవి, 28న కొత్తపాలెం, 29న దిండి, 30న కొత్తపాలెం-2, 31న గుర్నాథ్ నగర్ గ్రామాలలో ఈ పశు వైద్య శిబిరాలు నిర్వహస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల ద్వారా పశువులకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, పశు వైద్య పరీక్షలతో పాటు అవగాహన సదస్సులు, పశు పోషకుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలు, గోకులం, బహు వార్షిక పశుగ్రాసాల సాగు, సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు (1962), పశు బీమా పథకం, పశుపోషకులకు నాణ్యమైన ఇన్‌పుట్ సబ్సిడీ సరఫరా, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, లింగ నిర్ధారిత వీర్యం, పిండ మార్పిడి పరిజ్ఞానంలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల్లోని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మార్టూరు రూరల్: స్థానిక పశువైద్యశాలలో డాక్టర్ మాధవిలత అధ్యర్వంలో నట్టల నివారణకు ఉచిత మందు పంపిణీ చేశారు. మూగజీవుల రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్ కుమార్ తెలిపారు. రాయితీపై ఇస్తున్న విత్తనాలు, గడ్డి, మందులను వినియోగించుకోవాలని సర్పంచ్ సతీష్ కుమార్ కోరారు. 70 గేదెలు, 80 దూడలు, 31 పశువులకు మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు పశువైద్యులు మాధవిలత తెలిపారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల రామ కోటేశ్వర రావు, రంగబాబు, గోరంట్ల లింగయ్య, వెటర్నరీ అసిస్టెంట్ అశ్వనీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఎస్వీ రమణ

మినీ గోకులం ప్రారంభం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలంలోని ఆళ్ళమూడి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేబ్రోలు సునీత ఇంటి వద్ద నిర్మించిన మినీ గోకులాన్ని ఆదివారం సర్పంచ్ పెద్దిశెట్టి రాంబాబు, ఎంపీడీవో ఎస్.వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో ఉపాధి హామీ నిధులతో మినీ గోకులాలను త్వరితగతిన నిర్మించడం జరిగిందన్నారు. త్వరగా నిర్మించుకున్నందుకు లబ్ధిదారులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ టి.ఊహారాణి, ఏపీవో శివపార్వతి, స్థానిక నాయకులు రాజులపాటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పి.ప్రదీప్ కుమార్, టీఏ సుధీర్, ఫీల్డ్ అసిస్టెంట్ రత్నకుమారి పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

సస్యరక్షణతో ఫలితాలు

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు మండలంలోని జంపనిలో పంట పొలాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సునీత సందర్శించారు. మొక్కజొన్న, జొన్న పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సస్యరక్షణ ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చున్నారు. బాపట్ల కృషి విజ్ఞాన్ కేంద్రం నుంచి డాక్టర్ మురారిధర్ నాయక్, రైతు శిక్షణ కేంద్రం నుంచి హుస్సేన్, జంపని వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రారంభం

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని బైటమంజులూరు గ్రామంలో భూముల రీసర్వేని రెవెన్యూ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంగులూరు తహశీల్దార్ పి.సింగారావు మాట్లాడుతూ బైటమంజులూరు గ్రామంలో భూముల రీసర్వేకు రెవెన్యూ ఉద్యోగులతో ఐదు టీంలను ఏర్పాటు చేశామని చెప్పారు. అంతేకాకుండా రైతుల సలహాలు సంప్రదింపుల కోసం ఒక కేంద్రాన్ని కూడా గ్రామంలో ఏర్పాటు చేశామన్నారు. ఇందులో వీఆర్వో, విలేజ్ సర్వేయర్ అందుబాటులో ఉంటారన్నారు. రైతులు ఏదైనా సమస్యలు ఉంటే వారికి తెలియజేయాలని సింగారావు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రుక్మిణి, మండల సర్వేయర్ సురేష్, మాజీ సర్పంచ్ శివరాజు, రైతులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



సూరేపల్లిలో సర్వే చేస్తున్న సిబ్బంది



బైటమంజులూరులో సర్వే చేస్తున్న అధికారులు

భట్టిప్రోలు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత రీసర్వే పనులు సోమవారం భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో ప్రారంభమయ్యాయి. ఈ పనులను తహశీల్దార్ మేక శ్రీనివాసరావు ప్రారంభించారు. సర్వేయర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భూములను సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వే వలన పెండింగులో ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

వేమూరు: వేమూరు మండలం వరాహపురం గ్రామంలో సోమవారం తహశీల్దార్ సుశీల రీసర్వే పనులు ప్రారంభించారు. ఈ రీసర్వేలో రైతులు దగ్గరుండి తమ భూములను కొలతల వేయించుకొని హద్దులు నిర్ణయించుకోవాలని, సర్వే అధికారులకు తోడ్పాటు అందించాలని కోరారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

ఆర్‌డీవో రామలక్ష్మి

ప్రజాశక్తి-రేపల్లె

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఆర్డీవో ఎన్.రామలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పదమూడు అర్జీలు వచ్చాయని చెప్పారు. రేపల్లె మున్సిపాలిటీలోని మూడో వార్డులో విజయదుర్గ రైస్ మిల్ నుంచి నల్లని మసి వెలువడుతుందని దీనివలన ప్రక్కనే ఉన్న 60 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని అర్జీ అందజేశారు. రేపల్లె మున్సిపాలిటీ నుండి చదలవాడ శివరామకృష్ణ అనువారు పెనుమూడి గ్రామం నుంచి గుడ్డికాయలంక అక్విడెక్ట్ వరకు గల మురుగు కాలువ వ్యర్థాలతో నిండి ఉన్నదని, సదరు మురుగు కాలువ సమస్యను పరిష్కరించాలని చదలవాడ శివరామకృష్ణ అర్జీ అందజేశారు. రేపల్లెలో నెహ్రూ బొమ్మ దగ్గర నుంచి రైల్వే స్టేషన్ వైపుగా ఉన్న ట్రాఫిక్ సమస్యను తీర్చాలని కోరుతూ తాళ్లతిప్ప గ్రామం నుంచి సామాజికవేత్త డివిఆర్



అర్జీలు పరిశీలిస్తున్న ఆర్‌డీవో రామలక్ష్మి

అర్జీ అందజేశారు.

పంగులూరు: పంగులూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు ఐదు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ పి.సింగారావు తెలిపారు. వీటిలో నూజిల్లపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన పుల్లెల సుబ్బయ్య, మద్దినేని ఆంజనేయులు భూమి వివాదాలకు సంబంధించి అర్జీ ఒకటి వచ్చిందని తెలిపారు. భూ సర్వేకి సంబంధించి 3, పాస్‌బుక్‌కు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ సుందరమ్మ

అక్షరాస్యత పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

తహశీల్దార్ సుందరమ్మ

ప్రజాశక్తి-కర్లపాలెం

అక్షరాస్యత పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తహశీల్దార్ సుందరమ్మ అన్నారు. సోమవారం ఉల్లాస్ (అడల్ట్ ఎడ్యుకేషన్)పై వాలంటరీ టీచర్లకు మండల పరిషత్ సమావేశ మందిరములో మండల సమాఖ్య ఆధ్వర్యములో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు చదవడం, రాయడం రానివారికి వుల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాలు నేర్పించడానికి వాలంటీర్ టీచరును నియమించిందన్నారు. శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రతి మహిళకు చదవడం రాయడంతో పాటు, డిజిటల్ శిక్షణ, ఫైనాన్షియల్ లిటరసీ, లీగల్ లిటరసీతోపాటు సామాజిక కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళ అక్షరాస్యత కలిగి ఉన్నప్పుడే ప్రభుత్వం కల్పించే మహిళ చట్టాలు సక్రమంగా వినియోగించుకుని వారిని వారు రక్షించుకోవచ్చున్నారు. మహిళలు ఆర్థిక మోసాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎన్.విజయశ్రీ, హెచ్‌ఎం పి.విజయభాస్కర్ రెడ్డి, వయోజన విద్య సూపర్‌వైజర్ సి.హెచ్. శివరామప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి, ఏపీఎం శ్రీనివాసులు రెడ్డి, సీసీ సి.హెచ్ రాఘవలు, శివకోటేశ్వరరావు, అకౌంటెంట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందిస్తున్న దృశ్యం

పోటీల్లో 'కృష్ణవేణి' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయిలో జరిగిన వ్యాసరచన, డిబేట్ పోటీల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. యర్రగొండపాలెం మండల స్థాయిలోని వివిధ ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో చదువుతున్న ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు ఈ మండల స్థాయి పోటీలో పాల్గొన్నారు. డిబేట్లో 9వ తరగతి చదువుతున్న హన్నా ఏంజెల్ మొదటి స్థానాన్ని, లాస్యశ్రీ రెండో స్థానాన్ని, పవిత్ర మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వ్యాసరచన పోటీలలో 9వ తరగతి చదువుతున్న సిరి చందనారెడ్డి మొదటి స్థానాన్ని, మాధవి రెండో స్థానాన్ని, రిజ్వానా మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. డిబేట్, వ్యాసరచన పోటీలలో ప్రథమ స్థానం పొందిన హన్నా ఏంజెల్, సిరి చందనరెడ్డిలను మండల విద్యాశాఖ అధికారులు ఆంజనేయులు, మల్లు నాయక్ అభినందించి బహుమతులను ప్రదానం చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బహుమతులు పొందిన విద్యార్థినులను, ఈ పోటీ పరీక్షలకు విద్యార్థులను నిష్ణాతులుగా తయారు చేసిన సోషల్ టీచర్ ఎలీషా బాబును కృష్ణవేణి టాలెంట్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ అభినందించారు.



జిజిహెచ్‌కు వీల్‌చైర్లు, స్ట్రక్చర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఘనంగా దామచర్ల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు జన్మదిన వేడుకలు సోమవారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే దామచర్ల దంపతులు వల్లూరమ్మ దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుండి స్వగ్రామం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంకు వెళ్లిన దామచర్ల ఆయన సతీమణి నాగసత్యలత వారి తల్లిదండ్రుల ఆశీస్సులను తీసుకున్నారు. అక్కడ నుండి ఒంగోలు చేరుకొని స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డిజెఆర్ ట్రస్ట్ ద్వారా వీల్ చైర్స్, స్ట్రక్చర్స్ అందజేశారు. అనంతరం ఒంగోలు టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవనంలో జరిగిన పుట్టిన రోజు వేడుకలలో ఆయన పాల్గొన్నారు. పార్టీ కార్యాలయానికి చేరుకున్న దామచర్లకు అభిమానులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకి ఫోన్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. దామచర్లకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ



దామచర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏలూరి

మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్, కంది రవిశంకర్, శ్రీ హర్షిణి విద్యా సంస్థల ఛైర్మన్ జి.రవికుమార్, ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, బండారు మదన్, 29వ డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి చంద్ర, తెలుగు నాడు రాష్ట్ర అంగన్‌వాడీ డ్వాక్రా కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి, టిడిపి ఒంగోలు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫా, టిడిపి ఒంగోలు నియోజకవర్గ నూర్‌బాషా సంఘ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలీ, ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ కె.వెంకటేశ్వర్లు బిసి కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ టి.రవికుమార్ ఉన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

మూడో రోజుకు చేరిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పివిఆర్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు సోమవారం నాడు మూడో రోజుకు చేరుకున్నాయి. సోమవారం నిర్వహించిన కళా ప్రదర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత పునుగోడు మంజునాథ నాదస్వర బందం ప్రదర్శించిన నాదస్వరం ప్రేక్షకులను తన్మయత్వం చేసింది. రాత్రి త్రోవగుంట చంద్రశేఖర్ దర్శకత్వ పర్యవేక్షణలో ఒంగోలుకు చెందిన చందు డాన్స్ అకాడమీ ప్రదర్శించిన నాట్యామోదృవం రూపకం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహజ వనరులను సంప్రదాయాలను స్మరణకు తెచ్చింది. జయతు జయతు కృష్ణవేణి అంటూ సాగిన గీతిక కృష్ణానది ప్రాశస్త్యాన్ని గుర్తుకు తెచ్చింది. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలను, సంస్కృతులు సంప్రదాయాలను, రాష్ట్ర రాజధాని అమరావతిని సృశిస్తూ ప్రదర్శించిన నృత్య గీతికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు కళాకారులను హరిబాబు సత్కరించారు.



చందు డ్యాన్స్ అకాడమీ కళాకారుల ప్రదర్శన

శివరాం ప్రశంసలు

ఎన్టీఆర్ కళాపరిషత్ నిర్వాహకులను కందుకూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం ప్రశంసించారు. సోమవారం నాడు మూడో రోజు పివిఆర్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న కళా ప్రదర్శనలను డాక్టర్ దివి శివరాం తన సతీమణి సౌభాగ్యతో కలిసి తిలకించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నల్లూరి వెంకటేశ్వర్లు, కళాపరిషత్ నిర్వాహకులు పలువురు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాభివృద్ధికి 'ఇంటర్న్‌షిప్'

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ ద్వారా రాబోయే 5 సంవత్సరాల్లో దేశంలోని టాప్ 500 కంపెనీలలో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పథకం ప్రారంభమైందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలియజేశారు. దేశవ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. మరిన్ని వివరాల కోసం 8978886348, 9866537945, 9966919485 నంబర్లను సంప్రదించవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్ తెలిపారు.

ఒంగోలులో కెవిపిఎస్ రాష్ట్ర వర్క్‌షాప్

- 14, 15 తేదీల్లో నిర్వహణ - కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఫిబ్రవరి 14, 15 తేదీలలో ఒంగోలులో జరిగే కెవిపిఎస్ రాష్ట్ర వర్క్ షాప్ ను జయప్రదం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు కోరారు. సోమవారం నాడు ఒంగోలు ఎల్బీజీ భవనంలో కెవిపిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జవ్వాజి రాజు అధ్యక్షత న జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలన చేసి రాబోయే రోజుల్లో సామాజిక ఉద్యమాలను మరింత బలోపేతం చేయడం కోసం ఈ రాష్ట్ర వర్క్ షాప్ నిర్వహించబోతున్నామని తెలిపారు, ఈ రాష్ట్ర వర్క్ షాపు జయప్రదం చేయడం కోసం అభ్యుదయవాదులు ప్రజాతంత్ర వాదులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. వర్క్ షాప్ లో దళితుల ఆర్థిక, సామాజిక సమస్యలు,వివక్షను రూపు మాపేందుకు చేపట్ట వలసిన సామాజిక ఉద్య మాల గురించి చర్చిస్తామన్నారు. కేంద్రంలో బిజెపి మూడో సారి అధికారం చేపట్టిన నాటినుంచి దళితుల పై అత్యాచారాలు, హత్యలు పెరిగాయని పేర్కొన్నారు.మరో వైపు హిందుత్వ పేరుతో ఆర్ ఎస్ ఎస్ మూకదాడులకు తెగబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయానా కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్లో రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానించినా చర్యలు లేకపోవటం విచారకరమన్నారు. అంబేద్కర్ ను అవమానించడం అంటే ఈ దేశంలో ఉన్న శ్రమజీవులను హేళన చేయడమేనని వ్యాఖ్యానించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురామ్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో నేటికీ దళితుల్లో సామాజికంగా, ఆర్థికంగా వెనుక బడి ఉన్నారని తెలిపారు. ప్రకాశం జిల్లాలో దళితులపై దాడులు కొనసాగుతున్నాయని అన్నారు. కనీసం స్మశానాలకు స్థలం లేని దళిత వాడలు అనేకం ఉన్నాయి అన్నారు ఈ సమస్యలపై భవిష్యత్తులో కార్యా చరణ చేపట్టి ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. అనంతరం కెవిపిఎస్ వర్క్ షాప్ పోస్టర్‌ను ఆవి ష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, వి.మోజేష్, టి. రామారావు, సంజీవరావు, దిడ్ల నారాయణ,ఉబ్బా వెంకటేశ్వర్లు, అంగలకూర్తి సూరిబాబు,మేకల రామయ్య, కాకుమాను సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజలకు చేరువగా రెడ్‌క్రాస్ సేవలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కలెక్టర్ వెంకటమురళి

జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థ సేవలు ఆపదలో ఉన్న ప్రజలకు మరింత చేరువ చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని రెడ్ క్రాస్ స్థూపాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తుఫాన్లు, విపత్తులు సంభవించినపుడు సహాయ కార్యక్రమాలు అందించడానికి రెడ్ క్రాస్ బందం సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఇప్పటికే రెడ్ క్రాస్ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేసి ప్రజలను ఆదుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రెడ్ క్రాస్ భవనం వద్ద జనరిక్ మెడికల్ షాపును ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈసందర్భంగా రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్ సెంటర్ ను ఆయన పరిశీలించారు. రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహశీల్దార్ సలీమా, రెడ్ క్రాస్ ఛైర్మన్ బట్టు,కార్యదర్శి శర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటమురళి

డాక్టర్ స్వామినాథన్ కమిటీ

సిఫార్సులను అమలుచేయాలి

- సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల డిమాండ్
- రైతాంగ సమస్యలపై ఎంపీలకు మెయిల్ సందేశం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

డాక్టర్ స్వామినాథన్ కమిటీ సూచించిన సిఫార్సులను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు సంయుక్తంగా డిమాండ్ చేశాయి. సోమవారం నాడు ప్రకాశం భవనం ఎదుట పార్లమెంట్ సభ్యులకు రైతాంగ సమస్యలపై మెయిల్ సందేశం పంపించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు రైతు ఉత్పత్తులకు 50 శాతం ప్రకారం ధర నిర్ణయించి చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకే పర్యాయం రుణమాఫీ అమలు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేసే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రైతాంగ సమస్యలపై నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు ఉద్యమ నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పార్లమెంటు సభ్యులకు ఈమెయిల్ పంపించే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మొన్నటి వరకు నోరు మెదపని కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రెటరీ ఫిబ్రవరి 14న చండీగఢ్ రైతులతో చర్చలకు సిద్ధమని ప్రకటించటం స్వాగతిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా చొరవ చూపాలని, ఆ మేరకు ప్రభుత్వంపై పార్లమెంట్ సభ్యులు ఒత్తిడి తేవాలని ఈమెయిల్ ద్వారా సందేశం పంపుతున్నట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లలితకుమారి, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కోడూరి నాంచార్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జజ్జూరు జయంతి బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, చీకటి శ్రీనివాసరావు, ఏఐటియుసి నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్‌టియూ నాయకులు ఎం ఎస్ సాయి, ఐ ఎఫ్ టి యు నాయకులు చొప్పర జాలయ్య, అభ్యుదయ వాది పిన్నిక శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు పోలవరపు సీతారామయ్య, లింగా ఆంజనేయులు, గెద్దల శాంసన్ తదితరులు పాల్గొన్నారు.